జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 2 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 6



# ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

- బీఎల్ఓలే ఇంటింటికీ వెళ్లి నోటీసులు, పత్రాల సేకరణ చేపట్టాలి
- సీఈఓ సుదర్శన్ రెడ్డి



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్01, (ప్రజాజ్యోతి)** ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి

మిగతా 2 లో...

- మొగుడు పంచాయితీ అయినా సరే..! భార్య పంచాయితీ అయినా సరే..!!
- మణుగూరులో అక్రమ పంచాయితీల దందా...
- పంచాయితీకి 50 వేలు వసూలు..!
- భార్యాభర్తలను విడగొట్టి పబ్బం గడుపుతున్న ఓ ముఠా...
- వడ్డీ వ్యాపారం, టూ వీలర్ల గుంజుకోలు...
- బరితెగించిన వసూల రాణిలు, రాజాలు...
- అక్రమ పంచాయితీలపై పోలీసులు కొరడా ఝుళిపించాలి...
- కొందరు బాధితుల డిమాండ్...



2 లో..

# పంచాయితీలు చేస్తామమ్మా..!

మణుగూరు ప్రాంతంలో అక్రమ పంచాయతీల దందా రోజురోజుకూ శృతిమించుతోంది. కులం, పార్టీ పేరు చెప్పకొని కొందరు వ్యక్తులు గ్రామాల్లో తామే పెద్ద మనుషులమంటూ చక్రం తిప్పుతున్నారు. చిన్న చిన్న గొడవలను భూతద్దంలో చూపిస్తూ, ముఖ్యంగా భార్యాభర్తల మధ్య చిన్న మాట పడితే చాలు వెంటనే రంగంలోకి దిగుతున్నారు. ఇద్దరినీ విడగొట్టి ఇరు వర్గాల మధ్య చిచ్చుపెట్టి, ఆ తర్వాత పంచాయతీ పేరుతో బెదిరింపులకు దిగుతున్నారు. పంచాయతీ చేసినందుకు ఏకంగా 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఇవ్వకపోతే పోలీస్ కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. ఇదే ముఠా వడ్డీ వ్యాపారంతో పేదల పాలిట కుంపటిగా మారింది.

# ప్రేమ పేరుతో మొదలై.. హత్యతో ముగిసిన బంధం



- నర్సింగ్ విద్యార్థిని హరిణి హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- నాలుగేళ్లగా ప్రేమ.. పెళ్లికి నిరాకరించడంతో హత్య
- పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకున్న జూలూరుపాడు పోలీసులు
- బైక్, రెండు సెల్‌ఫోన్లు, గేర్ వైర్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కొత్తగూడెం డీఎస్పీ ఎల్. ఆదినారాయణ

**జూలూరుపాడు, అక్టోబర్ 1, ప్రజాజ్యోతి:** బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఇంద్రపల్లి హరిణి(18) హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడు దేవరకొండ పవన్‌కుమార్(22)ను జూలూరుపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. సెప్టెంబర్ 22న వెంగన్నపాలెం గ్రామంలోని తన ఇంటి వద్ద హరిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా.. పోస్టుమార్టం నివేదికలో మెడకు వైర్ వంటి వస్తువుతో బిగించి హత్య చేసినట్లు తేలడంతో పోలీసులు కేసును హత్య కేసుగా మార్చారు. పోలీసుల దర్యాప్తులో హరిణి, పవన్‌కుమార్ గత నాలుగేళ్లుగా ప్రేమించుకున్నట్లు, వివాహం చేసుకోవాలని భావించినట్లు వెల్లడైంది. అయితే ఇరువురి కుటుంబాల మధ్య వివాదాల నేపథ్యంలో హరిణి వివాహానికి నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కారణంతోనే పవన్‌కుమార్ హరిణిని హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. హత్య అనంతరం నిందితుడు పరారై..

మిగతా 2 లో...

# దుగినేపల్లి పంచాయతీ నిధులపై ఆరోపణలు.. 'హస్తానికి' తలనొప్పి!




- గ్రామపంచాయతీల్లో కొందరి వ్యవహారశైలిపై పార్టీ శ్రేణుల్లో ఆందోళన
- నిధుల వినియోగంపై ఆరోపణలు.. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు వస్తోందన్న అభిప్రాయాలు
- దుగినేపల్లి పంచాయతీ వ్యవహారంపై సమగ్ర విచారణకు డిమాండ్

6 లో...

# చర్ల సీహెచ్‌సీలో పెరిగిన ప్రసూతి సేవలు

- నెలకు 3 నుంచి 50కి చేరిన ప్రసవాల సంఖ్య
- సీహెచ్‌సీలో వైద్య సేవలపై మంత్రి పొంగులేటి ప్రశంసలు



**చర్ల, అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి):** మారుమూల గిరిజన ప్రాంతమైన చర్లలో మాతా శిశు వైద్య సేవలు గణనీయంగా బలోపేతం అవుతున్నాయి. గతంలో నెలకు 3–4 ప్రసవాలు మాత్రమే జరిగే చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం నెలకు సుమారు 50 ప్రసవాలు జరిగే స్థాయికి సేవలు విస్తరించాయి. దీంతో గర్భిణులకు అత్యవసర సమయాల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, స్థానికంగానే ప్రసూతి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.సెప్టెంబర్ నెలలో చర్ల సీహెచ్‌సీలో మొత్తం 46 ప్రసవాలు జరిగాయి. వీటిలో 30 సాధారణ ప్రసవాలు, 16 సిజేరియన్ ప్రసవాలు ఉన్నాయి. అలాగే 8 హైరిస్క్ ప్రసూతి కేసులకు సకాలంలో వైద్య సేవలు అందించారు. వీటిలో 4 ప్రీ-ఎక్లాంప్సియా, ఒక ఎక్లాంప్సియా, ఒక అబ్రప్షియో ప్లాసెంటా, ఒక గ్రాండ్ మల్టీపారా, ఒక అబ్స్ట్రక్టెడ్ లేబర్ కేసు ఉన్నాయి.చర్ల నుంచి భద్రాచలం సుమారు 56 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రసూతి అత్యవసర పరిస్థితుల్లో రవాణా సమయం కీలకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో హైరిస్క్ గర్భిణులకు చర్లలోనే అవసరమైన ప్రసూతి, సిజేరియన్ సేవలు అందుబాటులో ఉండటం ఎంతో ప్రయోజనకరంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో గోల్డెన్ అవర్స్‌లో వైద్యం అందించడం ద్వారా తల్లి, శిశువుల ప్రాణాలను కాపాడే అవకాశాలు మెరుగుపడుతున్నాయి.చర్ల సీహెచ్‌సీలో ప్రసూతి సేవలను మరింత

మిగతా 2 లో...

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి




(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులు, పత్రాల స్వీకరణ, విచారణలు, ఫారం–6, 7, 8 తదితర అంశాలపై సమీక్షించారు. కొత్తగూడెం కలెక్టరేట్ ఐడీఓసీ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను కార్యాలయాలకు పిలిపించి నోటీసులు ఇవ్వడం లేదా పత్రాలు స్వీకరించడం చేయరాదని సీఈఓ స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు అవసరమైన పత్రాలను స్వీకరించాలని సూచించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన విచారణలను సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని తెలిపారు.ఫారం–6ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఈఓ ఆదేశించారు. అలాగే ఫారం–6, ఫారం–7, ఫారం–8కు సంబంధించిన వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు అంశంపై కూడా సీఈఓ సుదర్శన్ రెడ్డి స్పష్టమైన సూచనలు చేశారు. ఓటర్ల అర్హత పరిశీలనలో 31–10–2026ను కట్ ఆఫ్ తేదీగా పరిగణించాలని ఆదేశించారు. అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకునేలా అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అందిన సూచనల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నోటీసులను పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి దశను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సూపరింటెంట్ రంగ ప్రసాద్ , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చర్ల సీహెచ్‌సీలో పెరిగిన ప్రసూతి సేవలు

(మొదటి పేజీ తరువాయి...)



విస్తరించేందుకు టీఐఎఫ్ఎఫ్ఏ స్కాన్, ఏఎన్‌సీ స్కాన్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో గర్భిణులు అవసరమైన యాంటీనేటల్ పరీక్షలు, స్కానింగ్ సేవలను స్థానికంగానే పొందే అవకాశం ఏర్పడింది.ప్రస్తుతం చర్ల సీహెచ్‌సీలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఒక గైనకాలజిస్ట్, ఒక అనస్థీషియాలజిస్ట్, రెగ్యులర్ ప్రాతిపదికన ఒక పీడియాట్రిషియన్ సేవలు అందిస్తున్నారు. వైద్యులు, నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సమన్వయంతో సాధారణ ప్రసవాలు, సిజేరియన్లు, ట్యూబెక్టమీతో పాటు హైరిస్క్ కేసులకు వైద్య సేవలు అందిస్తున్నారు.మారుమూల గిరిజన ప్రాంతంలో వైద్య సేవలను బలోపేతం చేయడంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ సహకారం కీలకంగా ఉందని అధికారులు తెలిపారు. వైద్యులకు అదనపు ప్రోత్సాహకాలు, అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులు, నర్సింగ్ సిబ్బంది తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.జిల్లా వైద్య సేవల సమన్వయంలో డీసీహెచ్ఎస్ డా. జి. రవి బాబు పర్యవేక్షణ, చర్ల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డా. సాయి వర్ధన్ ఆధ్వర్యంలోని వైద్య, నర్సింగ్ సిబ్బంది సమిష్టి కృషితో ప్రసూతి సేవలు విస్తరిస్తున్నాయి.చర్లలో ప్రసూతి సేవలు బలోపేతం కావడంతో మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు సమీపంలోనే సురక్షితమైన, సమయానుకూలమైన మాతా శిశు వైద్య సేవలు అందుతున్నాయి. ప్రసవాలతో పాటు హైరిస్క్ కేసుల నిర్వహణ, సిజేరియన్, ట్యూబెక్టమీ, టీఐఎఫ్ఎఫ్ఏ, ఏఎన్‌సీ స్కానింగ్ సేవలు అందుబాటులోకి రావడంతో చర్ల సీహెచ్‌సీ మాతా శిశు ఆరోగ్య సేవలకు ముఖ్యమైన కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది.ఇటీవల 30 పడకల చర్ల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ద్వారా చర్ల ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను తెలుసుకుని సిబ్బందిని అభినందించారు. మారుమూల ప్రాంతంలో అందిస్తున్న వైద్య సేవలను పలు వేదికలపై కొనియాడారు.

- మొగుడు పంచాయితీ అయినా సరే..! భార్య పంచాయితీ అయినా సరే..!!
- మణుగూరులో అక్రమ పంచాయితీల దందా...
- పంచాయితీకి 50 వేలు వసూలు..!
- భార్యాభర్తలను విడగొట్టి పబ్బం గడుపుతున్న ఓ ముఠా...
- వడ్డీ వ్యాపారం, టూ వీలర్ల గుంజుకోలు...
- బరితెగించిన వసూలు రాణిలు, రాజాలు...
- అక్రమ పంచాయితీలపై పోలీసులు కొరడా ఝుళిపించాలి...
- కొందరు బాధితుల డిమాండ్...



# పంచాయితీలు చేస్తామమ్మా..!

**మణుగూరు ప్రాంతంలో అక్రమ పంచాయతీల దందా రోజురోజుకూ శృతిమించుతోంది. కులం, పార్టీ పేరు చెప్పకొని కొందరు వ్యక్తులు గ్రామాల్లో తామే పెద్ద మనుషులమంటూ చక్రం తిప్పతున్నారు. చిన్న చిన్న గొడవలను భూతద్దంలో చూపిస్తూ, ముఖ్యంగా భార్యాభర్తల మధ్య చిన్న మాట పడితే చాలు వెంటనే రంగంలోకి దిగుతున్నారు. ఇద్దరినీ విడగొట్టి ఇరు వర్గాల మధ్య చిచ్చుపెట్టి, ఆ తర్వాత పంచాయతీ పేరుతో బెదిరింపులకు దిగుతున్నారు. పంచాయతీ చేసినందుకు ఏకంగా 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఇవ్వకపోతే పోలీస్ కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. ఇదే ముఠా వడ్డీ వ్యాపారంతో పేదల పాలిట కుంపటిగా మారింది. అవసరంలో ఉన్నవారికి అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి, కట్టలేకపోతే వారి ఇళ్లపైకి వెళ్లి దౌర్జన్యంగా టూ వీలర్లు, సెల్ ఫోన్లు గుంజుకుంటున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని కుల సంఘం ముసుగులో అరాచకం సృష్టిస్తున్న ఈ దందాపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితులు భయంతో బయటకు చెప్పకోలేక నలిగిపోతున్నారు.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 01, ప్రజాజ్యోతి...**

మణుగూరు మండల వ్యాప్తంగా అక్రమ పంచాయతీల ముసుగులో జరుగుతున్న వసూళ్ల దందా ఇప్పుడు బయటపడుతోంది. బాధితుల కథనం ప్రకారం, బీసీ పార్టీ సంఘానికి కొందరు వ్యక్తులు కుల సంఘం, పార్టీ పేరు చెప్పుకుంటూ కుటుంబ తగాదాల్లో జోక్యం చేసుకుంటున్నారు. రాజీ కుదర్చడానికి బదులు వివాదాన్ని రెచ్చగొట్టి, పంచాయతీ పరిష్కారం పేరుతో రూ.50 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా అధిక వడ్డీకి రుణాలు ఇస్తూ, సకాలంలో చెల్లించని పేద కుటుంబాల నుంచి ద్విచక్ర వాహనాలను బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం పోలీసులకు తెలియడంతో చివాట్లు పెట్టినట్లు తెలుస్తోంది.

### మేమే పెద్దమనుషులం...!

మేమే పెద్ద మనుషులం, మా మాటే శాసనం అంటూ మణుగూరులో బీసీ సంఘానికి చెందిన కొందరు వ్యక్తుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. కులం పేరు చెప్పుకొని గ్రామాల్లో చిన్న గొడవ జరిగితే చాలు, వెంటనే వాలిపోతున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలను ఆసరాగా చేసుకొని ఇద్దరినీ విడగొట్టి, పంచాయతీ పేరుతో భారీ వసూళ్లకు తెగబడుతున్నారు. పంచాయతీ చేసినందుకు 50 వేలు ఇవ్వాల్సిందేనంటూ బాధిత కుటుంబాలను బెదిరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇవ్వకపోతే కేసులు పెట్టి జైలుకు పంపుతామని భయపెడుతున్నారు. అంతేకాదు ఇదే ముఠా వడ్డీ వ్యాపారాన్ని కూడా యథేచ్ఛగా సాగిస్తోంది. అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి, కట్టలేని వారి నుంచి టూ వీలర్లను బలవంతంగా లాక్కెళ్తున్నారు. కుల సంఘం ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని చేస్తున్న ఈ దందాపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని బాధితులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



### పెద్ద ఎత్తున వడ్డీ వ్యాపారం...కట్టలేకపోతే బైకులు సీజ్..!

మణుగూరులో పెద్ద ఎత్తున సాగుతున్న అక్రమ వడ్డీ వ్యాపారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యక్తులు కులం పేరుతో, పంచాయతీ పెద్ద మనుషుల ముసుగులో పేదలను లక్ష్యంగా చేసుకొని దందా చేస్తున్నారనే ఆరోపణలు బయటకు వస్తున్నాయి. అవసరం లో ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధిక వడ్డీకి డబ్బులు అప్పుగా ఇస్తున్నారు. వారం, నెల వడ్డీ పేరుతో 10 శాతం వరకు వసూలు చేస్తున్నారు. సకాలంలో కట్టలేకపోతే ఇళ్లపైకి దండెత్తి అరాచకం సృష్టిస్తున్నారు. బాధితుల దగ్గర నుంచి ద్విచక్ర వాహనాలను, సెల్ ఫోన్లను బలవంతంగా లాక్కెళ్తున్నారు. ఇప్పటికైనా వెంటనే పోలీసులు దృష్టి సారించి, ఇలాంటి అక్రమ పంచాయతీల ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నారు.

## ప్రేమ పేరుతో మొదలై.. హత్యతో ముగిసిన బంధం

(మొదటి పేజీ తరువాయి...)

ఒంటిగూడిసె రోడ్డులోని సీతారామ ప్రాజెక్టు కాలువ సమీపంలో దాచిన గ్లామర్ బైక్‌ను తీసుకుని దూర ప్రాంతానికి వెళ్లి ర్యాపిడోలో పనిచేస్తూ జీవించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో జూలూరుపాడు సీఐ, ఎస్ఐ, సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి టిఎస్ 28 జి 9583 నంబర్ గల గ్లామర్ బైక్, రెండు మొబైల్ ఫోన్లు, బైక్ గేర్ వైర్, నిందితుడు ధరించిన షర్ట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు ఫోన్లలో ఒకటి మృతురాలి ఫోన్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# పీఆర్ టీయూటీఎస్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా ఎస్ ఎస్ ఎస్ రవికుమార్






**చర్ల, అక్టోబర్ 01(ప్రజా జ్యోతి):** పీఆర్ టీయూటీఎస్ చర్ల మండల శాఖ సర్వసభ్య సమావేశం గురువారం లక్ష్మీకాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్వహించారు. సమావేశానికి సీనియర్, జూనియర్ ఉపాధ్యాయులు హాజరై పలు సూచనలు, సలహాలు అందించారు. రాష్ట్ర, జిల్లా నాయకులు తమ అనుభవాలను సభ్యులతో పంచుకున్నారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు.అనంతరం పీఆర్ టీయూటీఎస్ చర్ల మండల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్ ఎస్ ఎస్ రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా టి. వీరభద్రరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా పున్నం వెంకట రమణ, ఉపాధ్యక్షుడిగా ఐ. వీరమోహన్ రావు, గౌరవ అధ్యక్షుడిగా మేడియం రామకృష్ణ ఎన్నికయ్యారు. మహిళా సంయుక్త కార్యదర్శిగా సఖినం సుజాత, మహిళా కార్యదర్శిగా ఎన్. పద్మలత, సంయుక్త కార్యదర్శిగా పలక నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. స్కూల్ కాంప్లెక్స్ ఇన్ చార్జీలను కూడా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎస్ ఎస్ ఎస్ రవికుమార్ మాట్లాడుతూ నూతన పీఆర్ సీని 2023 జూలై 1 నుంచి అమలు చేస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, సీపీఎ స్ ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెం డిం గ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలని, పెన్షనర్లకు పెండింగ్ నిధులు విడుదల చేయడంతో పాటు డీఏలను సకాలంలో విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాల ద్వారా పోరాడాల్సిన అవసరం ఉందని అందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యల సాధన సాధ్యమవుతుందని రవికుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, శ్రీనివాస్, గురుమూర్తి, కాంతారావు, పలక నాగేశ్వరరావు, తాటి పాపారావు, జ్యోతి, సురేష్ బాబు, రామకృష్ణ, రామ్మోహన్, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## నల్ల మినుము సాగుపై రైతులకు శిక్షణ



**చర్ల, అక్టోబర్ 01(ప్రజా జ్యోతి):**కృషి విజ్ఞాన కేంద్రం, భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో ఆర్ఏఆర్ఎస్ వరంగల్ సహకారంతో ఏఐసీఆర్పీ–పల్సెస్ పథకంలోని ఫ్రంట్ లైన్ డెమాన్‌స్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా నల్ల మినుము సాగుపై రైతులకు శిక్షణ, విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చర్ల మండల రైతు వేదికలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా. టి. భరత్ నల్ల మినుము సాగు ప్రాధాన్యతను, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించేందుకు శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు.డా. పద్మజ, శాస్త్రవేత్త (వృక్ష రోగ శాస్త్రం) నల్ల మినుములో వచ్చే వివిధ తెగుళ్లు, పురుగు సమస్యలు, వాటి నివారణకు చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో ఫ్రంట్ లైన్ డెమాన్‌స్ట్రేషన్ల ప్రాధాన్యతను తెలిపారు.డా. క్రాంతికుమార్, శాస్త్రవేత్త (నేల శాస్త్రం) సమతుల్య పోషక యాజమాన్యం, ఎరువుల వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం ఎంబీజీ–1070 రకం నల్ల మినుము విత్తనాలతో పాటు రైజోబియం జీవ ఎరువును 30 మంది రైతులకు పంపిణీ చేశారు.సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, వ్యవసాయ అధికారి రవితేజరెడ్డి, ఏఈఓ మహమ్మద్ అఫ్రీద్, మైరాడా ఎన్జీవో ప్రతినిధి షణ్ముఖ్ సాయి, సుమారు 35 మంది రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు

- ప్రజావాణి నోడల్ అధికారిపై మైనార్టీ సంఘం ఫిర్యాదు
- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి యాకుబ్ పాషా



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 1, (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ప్రజావాణిలో పిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి యాకుపాషా ఆధ్వర్యంలో ఈ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు , ఈ సందర్భంగా యాకూబ్ పాషా మాట్లాడుతూ పాల్వంచ పట్టణంలోని సర్వే నెంబర్ 708 లో 7.35 గుంటల స్థలాన్ని గతంలో కేటాయించడం జరిగిందని కాలక్రమేణా ఈ స్థలం ఆక్రమణకు గురిఅవ్వడంతో స్థానిక రెవెన్యూ అధికారులు ఇట్టి స్తలాన్ని రెండుసార్లు పంచనామా నిర్వహించి ప్రస్తుతం 2.26 గుంటల స్థలం మిగిలి ఉన్నట్లుగా గుర్తించి నిర్ధారణ చేయడం జరిగిందని రెవెన్యూ అధికారులు ఇట్టి ముస్లిమ్ స్మశాన వాటికలో ఖననం చేయకుండా గతంలో అధికారులు నిలిపివేశారని, ఈ స్థలంలో పూర్వీకుల సమాధులు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు మాత్రం అడ్డుకుంటున్నారని తెలిపారు. పాల్వంచలో సుమారు 15 వేల ముస్లిం జనాభా కలిగి ఉండి ముస్లిం లు మరణిస్తే ఖననం చేయటానికి ఇబ్బందులు గురికావాల్సి వస్తుందని. దీని దృష్టిలో ఉంచుకుని స్మశాన వాటికలో మరణించిన ముస్లింలకు ఖననాలు చేయటానికి అనుమతి ఇవ్వాలని ఆగస్టు 17న ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేయగా అధికారులు నేటి వరకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని అన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి నటరాజ్ సెంటర్ లో గల ముస్లిం స్మశానవాటికలో ఖననాలకు అనుమతి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో వ చ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## శ్రీ దేవి నవరాత్రి మహోత్సవాలను నియమనిష్టలతో జరుపుకోవాలి

- డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 1, (ప్రజా జ్యోతి)** అక్టోబర్ 11 వ తేదీ నుండి జరుపుకునే అమ్మవారి శ్రీ దేవి నవరాత్రి మహోత్సవాలను నియమనిష్టలతో, భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకోవాలని డిసిఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పనులు ప్రారంభించడానికి నిర్వాహకులు కర్ర పూజ కార్యక్రమం నిర్వహించారు. పాల్వంచ పట్టణ పరిధిలోని శివనగర్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ దుర్గాసేవా సమితి ఆధ్వర్యంలో, పాల్వంచ భజన మందిరం రామాలయం వద్ద జై దుర్గాభవాని ఆధ్వర్యంలో జరిగిన కర్ర పూజా కార్యక్రమాల్లో కొత్వాల పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ దుర్గామాత పూజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు. అమ్మ దయ ఉంటే లోకానికంతటికీ శుభం జరుగు జరుగుతుందని అన్నారు ,ఈ కార్యక్రమంలో వైద్యులు కిరణ్, దేవరకట్ల శంకర్ రావు, దేవరకట్ల విజయలక్ష్మి, కార్పొరేటర్ సీరపు సుగుణ, నిర్వాహకులు సంతోష్‌రెడ్డి (బబ్లూ), చింతా నాగరాజు, ధన్ రాజ్, కేశబోయిన కోటేశ్వరరావు, చిప్పా పెద్దసత్యం, చిప్పా చిన్నసత్యం, గణేష్, బాలకృష్ణ, సాయికృష్ణ, చిప్పా పవన్ కళ్యాణ్, చిప్పా భార్గవ్, చిప్పా జంపన్న, యండి.యూనస్, బాబా, ఫయాజ్, చిలకా రాహుల్, వేణు, మనీశ్వర రావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## సీఆర్‌పీఎఫ్ స్వచ్ఛతా కార్యక్రమం



**చర్ల , అక్టోబర్ 01(ప్రజా జ్యోతి):** దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "ఒక రోజు ఒక గంట కలిసి" స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో భాగంగా చర్ల మండలం ఆర్. కొత్తగూడెం స్థానిక మార్కెట్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ 81వ బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొని మార్కెట్ పరిసరాలను శుభ్రం చేశారు.ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, సామూహిక శ్రమ ద్వారా సామాజిక బాధ్యతను పెంపొందించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు సూచించారు. కమాండెంట్ ముఖేష్ కుమార్ సింగ్, సెకండ్–ఇన్–కమాండ్ సంతోష్ చౌహాన్, హి మాన్షు కుమార్, డీసీ రాజేష్ డోగ్రా, డాక్టర్ మహమ్మద్ ఫైజ్, ఆర్. కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, దానవాయిపేట రూంజా రాజా, వార్డు సభ్యుడు చింతకాయల రవీందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎన్ ఆర్ ఐ స్కాలర్ షిప్ ల పంపిణీ

**చర్ల, అక్టోబర్ 01: (ప్రజా జ్యోతి ):** మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు 'మీకోసం మేమున్నాం' టీం ఆధ్వర్యంలో ఎన్ ఆర్ ఐ స్కాల ర్ షిప్ ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చర్లలో నిర్వహించారు. శ్రీ వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాల వేదికగా జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కనపర్తి ఈదయ్య, ఎంఈవో పరిటాల వెంకట రమణ చేతుల మీదుగా విద్యార్థులకు స్కాల ర్ షిప్ లను అందజేశారు.చర్ల మండలం లింగాపురానికి చెందిన ఎన్ ఆర్ ఐ పరుచూరి ప్రశాంత్ కుమారుడు అర్జున్ పరుచూరి, అమెరికాలో ప్లస్–2 చదువుతూ తన సహ విద్యార్థుల సహకారంతో ఈ స్కాలర్ షిప్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది చర్ల మండలానికి చెందిన 11 మంది విద్యార్థినీ విద్యార్థులకు మొత్తం రూ. 66,500 విలువైన స్కాలర్ షిప్ లను అందించారు. భవిష్యత్తులో స్కాలర్ షిప్ ఫండ్ ను మరింత పెంచి ఎక్కువ మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటామని అర్జున్ పరుచూరి తెలిపారు. 'మీకోసం మేమున్నాం' టీం గతంలో సైతం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, బ్యాగుల పంపిణీ, సీపీఆర్ శిక్షణ తరగతులు, వారాంతపు అన్నదాన కార్యక్రమాలు వంటి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించిందని సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీవో కనపర్తి ఈదయ్య మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులను గుర్తించి వారికి అండగా నిలిచేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంఈవో పరిటాల వెంకట రమణ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపయోగపడే ఈ స్కాలర్ షిప్ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మైనేని పద్మజ, గౌరీ శంకర్, లిఖిత, గొట్టిపాటి శ్రీనివాసరావు, దొడ్డ ప్రభుదాస్, కవ్వాల రాము, దొడ్డి సూరిబాబు, అక్కినేని నెహ్రూ, ముమ్మనేని అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



## డీజీపీ సీవీ ఆనంద్ ను సన్మానించిన టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు



**కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ / అక్టోబర్ 01, (ప్రజాజ్యోతి)** పాల్వంచలో ఇటీవల శ్యామల గోపాలన్ ఏఐఎస్టిఏ 2026 టెన్నిస్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన డీజీపీ సీవీ ఆనంద్‌ను కొత్తగూడెం జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు.టోర్నమెంట్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా జిల్లా టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వై. వెంకటేశ్వర్లు (వై వి) ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్‌కు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం శ్యామల గోపాలన్ ఏఐఎస్టిఏ 2026 టోర్నమెంట్ జ్ఞాపికను అందజేశారు.టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా రావడానికి అంగీకరించి, ఆహ్వానాన్ని స్వీకరించిన డీజీపీ సీవీ ఆనంద్‌కు అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు





**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 1,(ప్రజా జ్యోతి)** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం స్థానిక కొత్తగూడెం క్లబ్లో ఘనంగా నిర్వహించారు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశానుసారం జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డి ఆర్ డి ఎ విద్యా చందన, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్, పద్మావతి జిల్లా రెవెన్యూ అధికారి, నాగలక్ష్మి జడ్పీ చీఫ్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్, అనూష జిల్లా పంచాయతీ అధికారులు ఎం. డబ్ల్యు.పి.ఎస్.సి. చట్టం 2007 పుస్తకాలను ఆవిష్కరించి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ వయో వృద్ధులను గౌరవించాలని, వారు కుటుంబం కోసం ఎన్నో త్యాగాలు చేసి కొడుకులని, కూతుర్లను ప్రయోజకులను చేశారని, ఇప్పటి తరం వాళ్లు పెద్దలను గౌరవించి వారి విలువలు తెలుసుకోవాలని తెలిపారు. అర్హులైన వయోవృద్ధులకు చేయూత పెన్షన్లు అందించడం జరుగుతుందని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి వెరిఫికేషన్ తర్వాత కొత్త పెన్షన్ మం జూరు చేయడం జరుగుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలను తీసుకోవాలని, వయో వృద్ధులకు బ్యాంకులలో ఆసుపత్రిలో ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి మాట్లాడుతూ జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ ఆఫీసు నందు తల్లితండ్రుల మరియు వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007 ప్రకారం మెయింటెనెన్స్ ట్రిబ్యునల్స్ చైర్మన్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ద్వారా కుటుంబ సభ్యులు వృద్ధ తల్లిదండ్రులకు పోషణ భృతి కల్పించేలా ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కుటుంబ సభ్యులు పోషణ భృతి కల్పించకపోయిన, నిరాదరణకు గురి చేసిన, ఆస్తులు లాక్కొని వెళ్లగొట్టిన తమ ఆర్డీవో ఆఫీసులో సంప్రదించాలని, విచారణ తర్వాత కుటుంబ సభ్యులకు ఎండబ్ల్యూపీఎస్సీ 2007 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. జడ్పీ సీఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మండలంలో వయోవృద్ధుల విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా జిల్లా నందు ఉన్న అన్ని మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని, పెద్ద జ్ఞాన బాండాగారాలు అని, వారి అనుభవాలు మన తరాలకు మన పిల్లల తరాలకు ఎంతో ఉపయోగ పడతాయని, వారిని గౌరవించడం మన ప్రథమ కర్తవ్యం అని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి అనూష మాట్లాడుతూ ప్రస్తుత సీనియర్ సిటిజన్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు తల్లిదండ్రుల ,వయోవృద్ధుల సంక్షేమానికి సేవలు చేస్తున్నందుకు వారి సేవలు వెలకట్టలేమని కొనియాడారు. జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయడం, పోషణ భృతి కల్పించకపోవడం, కనీస అవసరాలు తీర్చలేకపోవడం, వారితో కుటుంబ సభ్యులు మాట్లాడకపోవడం, కుటుంబ సభ్యులు ఉద్యోగరీత్యా, ఉపాధిక కొరకు వేరే ప్రదేశాలకు వెళ్లి తల్లి తండ్రులను పట్టించుకోకపోవడం ఎక్కువగా జరుగుతున్నాయని, అందు వల్ల వయో వృద్దులు ఒంటరితనంతో బాధ పడుతున్నారని, కుటుంబ సభ్యులు ఖాళీ దొరికినప్పుడల్లా వృద్ధ తల్లి దండ్రులతో సమయం గడపాలని తెలిపారు. జిల్లా నందు ఏడుగురు వృద్ధాశ్రమాలు నడపబడుతున్నావని, వయోవృద్ధుల కాలక్షేపం కొరకు బాబు క్యాంప్ నందు ప్రణాం డే కేర్ సెంటర్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్మించడం జరిగిందని, వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయుట, పోషణ భృతి కల్పించకపోవడం, కనీస అవసరాలు తీర్చకపోయినా రెవిన్యూ డివిజన్ ఆఫీస్ కి వెళ్లలేని వారు tgseniorcitizens.cgg.g.ov.in ఆన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, వయో వృద్ధుల హెల్ప్ లైన్ నంబర్ 14567 ఉపయోగించుకోవాలని తెలిపారు. వయో వృద్ధుల సంక్షేమం, శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న సంఘాలను స్వచ్ఛంద సంస్థల సభ్యులు రావి వెంకటయ్య, చాగంటి కృష్ణమూర్తి, వాసాల నాగమణి, సీతా రామశాస్త్రి, రామయ్య, శంకర్, సుజాత, సరోజ సుబ్బారావు లను సన్మానించడం జరిగింది. హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దినేష్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిటిజన్ అసోసియేషన్ సభ్యులు నాగేశ్వర రావు, సురేష్, భూషణ్ రావు, పి ఎస్ ఎన్ రెడ్డి, పాపయ్య, వెంకటేశ్వర రావు, కృష్ణయ్య, సందీప్, పి.ఎస్.ఎన్.రెడ్డి, జయరాం, వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, నాగేశ్వరరావు, అబ్రహం, లక్ష్మయ్య, సిబ్బంది హరి కుమారి, రూప, వరప్రసాద్ నరేష్, ప్రవీణ్, వైద్య సిబ్బంది మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

- ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడండి
- డీఐజీ రాజేష్ పాండే
- ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం



**భద్రాచలం, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి):** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని ఓపీఎస్ కుంట డీఐజీ రాజేష్ పాండే పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఇంజిరాంలోని 219వ బెటాలియన్ సీఆర్పీఎఫ్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా శిబిరాన్ని రాజేష్ పాండే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం గొప్ప మానవతా సేవ అని అన్నారు. ప్రమాదాల్లో గాయపడినవారితో పాటు తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, కేన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి అత్యవసర సమయాల్లో రక్తం ఎంతో అవసరమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని కోరారు.ఈ శిబిరంలో 59 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో కమాండెంట్లు ప్రేమ్ జీత్ కుమార్, విజయ భాస్కర్, పార్థసారథి ఘోష్, విశ్వదీప్, సుధీర్ కుమార్ చౌహాన్, మెడికల్ ఆఫీసర్ డా. సుప్రియతో పాటు పలువురు జవాన్లు పాల్గొన్నారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ డా. ఎస్.ఎల్. కాంతారావు, వైస్ చైర్మన్ చల్లగుళ్ల నాగేశ్వరరావు శిబిరానికి హాజరై రక్తదాతలను అభినందించారు. భద్రాచలంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఆధునిక పరికరాలతో సురక్షితమైన రక్తాన్ని అవసరమైన వారికి అందిస్తూ సేవలందిస్తోందని వారు తెలిపారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం సీఆర్పీఎఫ్ అధికారులను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డా. ఎ.ఎస్.ఆర్. చంద్ర ప్రసాద్, జిల్లా కోశాధికారి టి.వి. బాలయోగి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.బి.జి. తిలక్, ఎం.బి. నర్సారెడ్డి, పల్లంటి దేశప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతకు ప్రజల భాగస్వామ్యమే బలం

- కృష్ణసాగర్‌లో ఐటీసీ ప్రతినిధులు, గ్రామస్థులతో శ్రమదానం

**బూర్గంపహాడ్, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి):** పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యకర సమాజానికి పునాది అని, గ్రామంలో స్వచ్ఛతను నిరంతరం కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కృష్ణసాగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తాటి వాణి, ఉపసర్పంచ్ బి.మోహన్‌రావు సూచించారు. గురువారం కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించారు.సర్పంచ్ తాటి వాణి,ఉపసర్పంచ్ బి.మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐటీసీ వాష్,ఇతర ఐటీసీ సంస్థల ప్రతినిధులతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రమదానం చేపట్టి గ్రామంలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు.ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై వి.బి.జి. రామ్‌జీ మ్యాప్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలతో పాటు గ్రామంలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తడి–పొడి చెత్తను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పరిశుభ్రత కేవలం ప్రభుత్వ లేదా పంచాయతీ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు భాగస్వామిగా మారినప్పుడే గ్రామం సంపూర్ణంగా స్వచ్ఛంగా ఉంటుందని పేర్కొన్నారు.అనంతరం గ్రామంలో నిరంతరం పారిశుధ్య సేవలు అందిస్తున్న ఎంపీడబ్ల్యూ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామ పరిశుభ్రత కోసం వారు అందిస్తున్న సేవలను అభినందించారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం ద్వారా మరింత ఉత్సాహంతో పనిచేసే వాతావరణం ఏర్పడుతుందని నిర్వాహకులు తెలిపారు.గ్రామంలో స్వచ్ఛతా కార్యక్రమాలు ఒక్కరోజుకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగాలని, ఇందుకు ప్రజల సహకారం, భాగస్వామ్యం ఎంతో అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు.గ్రామాన్ని పరిశుభ్రంగా,ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ, సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, వార్డు సభ్యులు,పంచాయతీ సిబ్బంది,ఐటీసీ సంస్థల ప్రతినిధులు,మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాభీష్టం మేరకు ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాలి

- సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



**భద్రాచలం, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి):** ప్రజాభీష్టం మేరకు ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పోలవరం ముంపు మండలాల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు సీపీఎం చేపట్టిన మోటార్‌సైకిల్ యాత్ర భద్రాచలం చేరుకుంది. రాజుపేటలో యాత్రకు సీపీఎం నాయకులు ఘన స్వాగతం పలికారు. కుంజ బొజ్జి స్మారక స్థూపం వద్ద శ్రీనివాసరావు, లోకనాథం నివాళులర్పించారు. కన్నాయిగూడెం నుంచి భద్రాచలం వరకు రహదారి దుస్థితిని చూస్తే కూటమి ప్రభుత్వ పాలన తీరు అర్థమవుతుందని శ్రీనివాసరావు విమర్శించారు. ఎటపాక–భద్రాచలం సరిహద్దులో కరకట్ట స్లూయిజ్ మరమ్మతులను వెంటనే చేపట్టాలని, భద్రాచలం రక్షణకు కరకట్టను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతాల ప్రజల పునరావాసం, మౌలిక వసతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# వ్యభిచార గృహం పై పోలీసుల దాడి

**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 1,(ప్రజా జ్యోతి)** పాల్వంచ దమ్మపేట సెంటర్ త్రివేణి స్కూల్ సమీపంలో ఓ గృహంలో వ్యభిచారం జరుగుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పట్టణ ఎస్సై టీ నాగరాజు ఆధ్వర్యంలో గురువారం రాత్రి దాడి నిర్వహించారు. ఈ దాడిలో పట్టుబడిన వారిలో ఇద్దరు ఆర్గనైజర్లు ఎం సంధ్య అలియాస్ ప్రశాంతి, సిహెచ్ బేబీ శ్యామల అలియాస్ అనూష వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు, వారితోపాటు నలుగురు మహిళలు, ఇద్దరు విటులు దొరికారు వారి వద్ద నుండి రెండు వేల రూపాయలు ,రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

## పత్తిలో పురుగుల నియంత్రణకు సమగ్ర సస్యరక్షణపై రైతులకు శిక్షణ



**బూర్గంపహాడ్, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి):** పత్తి పంటలో చీడపీడలు, తెగుళ్లను సమర్థవంతంగా నియంత్రిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అవలంబించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్ గ్రామంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం పత్తిలో సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం)పై రైతులకు శిక్షణ కార్యక్రమంతో పాటు క్షేత్ర సందర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా. టి.భరత్ మాట్లాడుతూ పత్తిలో పురుగుల ఉధృతిని ముందుగానే గుర్తించి నియంత్రించేందుకు రైతులు వివిధ సస్యరక్షణ పద్ధతులను సమన్వయంతో వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా స్టిక్కీ ట్రాప్స్, ఫెరోమోన్ ట్రాప్స్, ట్రాప్ పంటలు, బౌండరీ పంటల వినియోగంతో పత్తి పంటను చీడపీడల నుంచి రక్షించుకోవచ్చని వివరించారు. అవసరానికి అనుగుణంగా మాత్రమే పురుగుమందులను వినియోగిస్తూ, పర్యావరణానికి అనుకూలమైన సమగ్ర సస్యరక్షణ విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఆత్మ డైరెక్టర్ బోడ దివ్య మాట్లాడుతూ రైతులు కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శాస్త్రీయ సాంకేతిక సేవలు, వ్యవసాయ సలహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటల సాగులో ఎదురయ్యే సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకు వచ్చి తగిన సూచనలు పొందాలని తెలిపారు.అనంతరం రైతులకు 19:19:19 పోషక ఎరువుతో పాటు స్టిక్కీ ట్రాప్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం పత్తి పంటలను పరిశీలించేందుకు క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పత్తిలో టొబాకో స్ట్రీక్ వైరస్ (టీఎస్వీ) లక్షణాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ వ్యాధి వ్యాప్తికి వాహకంగా పనిచేసే త్రిప్స్ పురుగుల నియంత్రణపై రైతులకు పలు సూచనలు చేశారు. పంటలో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే గుర్తించి, వ్యాప్తిని అరికట్టేందుకు సమయానుకూలంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ తాటి వాణి,ఏఈఓ,కేవీకే సిబ్బంది, రేవాప్ విద్యార్థులు,రైతులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తొలి, మలితరం ఉద్యమకారుడు, విశ్రాంత ప్రిన్సిపల్ తిప్పన సిద్ధులు

- చాప కింద నీరులా కార్యాచరణ





**భద్రాచలం, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి):** ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో భద్రాచలానికి చెందిన తొలి, మలితరం ఉద్యమకారుడు, విశ్రాంత ప్రిన్సిపల్ తిప్పన సిద్ధులు చాప కింద నీరుల కార్యచరణ మొదలుపెట్టినట్లు తెలుస్తుంది. పట్టభద్రుల సమస్యలు, విద్యారంగ అంశాలు, నిరుద్యోగ సమస్యలపై తనదైన వాణిని వినిపించేందుకు ఆయన ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.తెలంగాణ ఉద్యమ తొలితరం నుంచి మలితరం వరకు వివిధ దశల్లో ఉద్యమాలతో అనుబంధం కలిగిన తిప్పన సిద్ధులు విద్యారంగంలో ప్రిన్సిపల్‌గా సేవలందించి విశ్రాంతి పొందారు. విద్యార్థులు, అధ్యాపకులు, పట్టభద్రుల సమస్యలపై అవగాహన ఉన్న ఆయన ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి, వారితో సిద్దులు మాస్టారు చర్చించినట్లు సమాచారం. అంతేకాకుండా తొలి, మలితరం ఉద్యమ నాయకులతో ఆయన సమావేశాలు నిర్వహించి, తన రాజకీయ ప్రస్థానానికి సంబంధించిన కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం.పట్టభద్రులను కలుసుకోవడం, వారి సమస్యలను తెలుసుకోవడం, ఎన్నికల కార్యాచరణను రూపొందించుకోవడంపై దృష్టి సారించినట్లు తెలిసింది.భద్రాచలం నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తిప్పన సిద్ధులు నిలవనున్నారనే వార్త రాజకీయ, విద్యారంగ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే ఆయన పోటీపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## దుగినేపల్లి పంచాయతీ నిధులపై ఆరోపణలు..

# ‘హస్తానికి’ తలనొప్పి!

- గ్రామపంచాయతీల్లో కొందరి వ్యవహారశైలిపై పార్టీ శ్రేణుల్లో ఆందోళన
- నిధుల వినియోగంపై ఆరోపణలు.. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు వస్తోందన్న అభిప్రాయాలు
- దుగినేపల్లి పంచాయతీ వ్యవహారంపై సమగ్ర విచారణకు డిమాండ్




**పినపాక, అక్టోబర్ 1: (ప్రజా జ్యోతి):** ప్రజా ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషి చేస్తున్నారని పార్టీ శ్రేణులు పేర్కొంటుండగా.. క్షేత్రస్థాయిలో కొందరు గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారుల వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారుతున్నాయన్న చర్చ నియోజకవర్గంలో సాగుతోంది. ముఖ్యంగా పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల బిల్లులు, ఎంబీలు, చెల్లింపుల విషయంలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తడం చర్చనీయాంశంగా మారింది. పంచాయతీ నిధులు ప్రజల అభివృద్ధి కోసం కేటాయించబడిన నేపథ్యంలో ప్రతి రూపాయి వినియోగానికి సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండటంతో పాటు పనులు క్షేత్రస్థాయిలో జరిగినట్లు నిర్ధారించే విధంగా అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. అయితే దుగినేపల్లి పంచాయతీకి సంబంధించి కొన్ని ఖర్చులు, పనులపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**ఎమ్మెల్యే కృషికి కొందరి తీరు ఆటంకమా?**

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముందుకు సాగుతున్న నేపథ్యంలో గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి నిధుల వినియోగం పారదర్శకంగా ఉండాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. అయితే స్థానిక స్థాయిలో నిధుల వినియోగంపై ఆరోపణలు రావడం, వాటిపై సరైన వివరణలు వెలువడకపోవడం వల్ల ప్రజల్లో అనుమానాలు పెరిగే అవకాశం ఉందని పలువురు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. వ్యక్తులపై వచ్చే ఆరోపణలను పార్టీతో ముడిపెట్టడం సరికాదని, అయితే అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, స్థానిక యంత్రాంగం వ్యవహారశైలిపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై అధికారులు పారదర్శకంగా స్పందించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు.

**‘హస్తం’కు చెడ్డపేరు వస్తోందంటున్న కార్యకర్తలు**

ప్రభుత్వం మారిన తర్వాత గ్రామ స్థాయిలో ప్రజలు పారదర్శక పాలనను ఆశిస్తున్నారని, ఇలాంటి సమయంలో పంచాయతీ నిధుల వినియోగంపై ఆరోపణలు రావడం పార్టీ ప్రతిష్ఠపై ప్రభావం చూపే అవకాశం ఉందని కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనులు సక్రమంగా జరిగితే వాటి వివరాలను ప్రజలకు వెల్లడించడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఆరోపణలు నిజం కాకపోతే అధికారిక రికార్డులతో వాటిని నివృత్తి చేయాలని కార్యకర్తలు కోరుతున్నట్లు సమాచారం.

**దుగినేపల్లిలో రూ.7.76 లక్షల ఖర్చుపై ప్రశ్నలు**

పినపాక మండలం దుగినేపల్లి గ్రామ పంచాయతీలో గత ఐదు నెలల్లో సుమారు రూ.7.76 లక్షల నిధుల ఖర్చుపై గ్రామస్థుల నుంచి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రికార్డుల్లో చూపిన పనులకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పనులకు పొంతన ఉందా? అనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొమరం సుధాకర్ పేరుతో సుమారు రూ.3 లక్షల వరకు ఎంబీలు, బిల్లులు ఉన్నాయన్న ఆరోపణలు, కిరణ్ ఎలక్ట్రికల్స్ పేరుతో సుమారు రూ.1.50 లక్షల మేర వైరింగ్, లైట్స్‌కు సంబంధించిన చెల్లింపులు జరిగాయన్న ఆరోపణలు చర్చకు వచ్చాయి. అయితే ఈ వివరాలపై అధికారిక రికార్డులు, సంబంధిత వ్యక్తుల వివరణలు అందుబాటులోకి వచ్చిన తర్వాతే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది. అందువల్ల ఈ అంశాలపై మండల, జిల్లా స్థాయి పంచాయతీ అధికారులు సమగ్రంగా పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**సంతకాలు.. ఎంబీలు.. చెల్లింపులపై స్పష్టత ఏది?**

పనుల బిల్లులు, ఎంబీల ప్రక్రియలో సర్పంచ్, ఉపసర్పంచ్‌ల సంతకాలు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో పంచాయతీ రికార్డులను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు అంటున్నారు. పనులకు సంబంధించిన అంచనాలు ఎవరు రూపొందించారు? పనులు ఎప్పుడు ప్రారంభమయ్యాయి? కొలతలు ఎవరు నమోదు చేశారు? ఎంబీలను ఎవరు ధ్రువీకరించారు? బిల్లులను ఎవరు పరిశీలించారు? చెల్లింపులకు ఎవరు అనుమతి ఇచ్చారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని వారు కోరుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

పంచాయతీ నిధుల వినియోగంలో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులతో పాటు సంబంధిత పంచాయతీ అధికారులు, సిబ్బంది కూడా తమ పరిధిలోని విధులను సక్రమంగా నిర్వహించాల్సి ఉంటుంది. పనుల అమలు, కొలతలు, బిల్లుల పరిశీలన, రికార్డుల నిర్వహణ, చెల్లింపుల ప్రక్రియ తదితర అంశాల్లో నిబంధనలు పాటించారా? లేదా? అనే విషయాన్ని ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు కోరుతున్నారు. కేవలం కార్యాలయ రికార్డులను పరిశీలించడమే కాకుండా.. రికార్డుల్లో చూపిన పనులు వాస్తవంగా గ్రామంలో జరిగాయా? వాటి పరిమాణం, నాణ్యత రికార్డులకు అనుగుణంగా ఉందా? అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**రికార్డులు బయటపెడితే అనుమానాలకు తెర**

దుగినేపల్లి పంచాయతీకి సంబంధించి సంబంధిత కాలానికి చెందిన ఎంబీలు, బిల్లులు, వౌచర్లు, పంచాయతీ తీర్మానాలు, బ్యాంకు లావాదేవీలు, చెల్లింపు వివరాలు, సరఫరా రికార్డులు, పనుల అంచనాలు, కొలతల పుస్తకాలు తదితర రికార్డులను పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అదేవిధంగా రికార్డుల్లో పేర్కొన్న పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫొటోలు, కొలతలు, పని పూర్తయిన స్థితి తదితర అంశాలను నమోదు చేస్తే వాస్తవ పరిస్థితి ప్రజలకు స్పష్టమవుతుందని వారు అంటున్నారు.

**పార్టీ నాయకత్వం దృష్టి సారించాలంటున్న శ్రేణులు**

కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు.. ప్రస్తుతం అధికారంలో ఉన్న సమయంలో వ్యక్తుల వ్యవహారశైలితో పార్టీకి చెడ్డపేరు రాకుండా నాయకత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. గ్రామపంచాయతీల్లో నిధుల వినియోగంపై వచ్చే ప్రతి ఆరోపణను రాజకీయ కోణంలో కాకుండా పరిపాలనా పరంగా పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని వారు కోరుతున్నారు.

**ఆరోపణలు నిజమైతే చర్యలు.. నిరాధారమైతే స్పష్టత**

దుగినేపల్లి పంచాయతీ నిధులపై వస్తున్న ఆరోపణలు నిజమా? నిరాధారమా? అనేది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది. సంబంధిత రికార్డులను పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించి సమగ్ర నివేదిక రూపొందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమని తేలితే పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచి అనుమానాలను నివృత్తి చేయాలని వారు కోరుతున్నారు. ఇప్పటికే తెలంగాణలో ఇతర పంచాయతీలకు సంబంధించి నిధుల వినియోగంపై వచ్చిన ఆరోపణలపై అధికారులు రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. దుగినేపల్లి వ్యవహారంలోనూ సంబంధిత పంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులు, జిల్లా పంచాయతీ యంత్రాంగం స్పందించి వాస్తవాలను వెల్లడిస్తే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెర పడే అవకాశం ఉంది. ఆరోపణలు వ్యక్తులపై ఉన్నప్పటికీ.. వాటి ప్రభావం ప్రభుత్వ పాలన, ప్రజాప్రతినిధులపై పడకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

